

# జోకిగ

అది ఆదివారం.

ఫిల్దీ జోక్స్‌క్లబ్ సభ్యులంతా సమావేశమయ్యారు.... సారీ, ఫిఫ్టీ జోక్స్‌క్లబ్ సభ్యులంతా సమావేశమయ్యారు. ఫిఫ్టీ జోక్స్ క్లబ్‌కి ఆ ఊరి ప్రజలు పెట్టిన ముద్దుపేరు ఫిల్దీ జోక్స్ క్లబ్‌లెండి!

క్లబ్ రూల్స్ ఏమిటంటే

1) సమావేశమైన ప్రతిసారి సభ పూర్తయేసరికి - సభ్యులంతా కలిసి, కనీసం ఫిఫ్టీ జోక్స్ చెప్పాలి.

2) నెలకి నాలుగు మీటింగులలో ప్రతి ఒక్కరూ కనీసం రెండు మీటింగులకైనా హాజరు కావాలి.

3) చెప్పిన ప్రతి మంచి జోక్‌కి రెండు మార్కులు.

4) దర్టీ జోక్‌కి నాలుగు మార్కులు! దర్టీ జోక్ ఆడవాళ్ళు చెప్తే ఆరు మార్కులు

5) టైమ్లీ జోక్‌కి టెన్ మార్క్స్! ప్రాక్టికల్ జోక్‌కి పది మార్క్స్ (అదేమిటి! అని హాచ్చెర్య పోకండి! అదో జోకు!)

6) ఏ జోకూ చెప్పకుండా జోగే జోగీశ్వరరావుకి ఫిఫ్టీన్ రూపీస్ పెనాల్టీ.

7) జోక్ చెప్పలేక సభకి ఎగనామం పెట్టడానికి ప్రయత్నిస్తే ఫిఫ్టీ రుపీస్ పెనాల్టీ.

8) దానిక్కూడా పంగనామం పెట్టడానికి ప్రయత్నిస్తే సభ్యులంతా కలిసి ఆదివారం టు శనివారం ఎకాయెకి ఎగేసిన సభ్యులింట్లో బడిపోయి ఏకజోకు పారాయణం సప్తాహం పెట్టేస్తారు. వాళ్ళ టిఫిన్లకి, భోజనాలకి, కాఫీలకి ఫిఫ్టీన్ హండ్రెడ్ పెనాల్టీ.



9) వరుసగా ఫిఫ్టీ మార్కు్స సంపాదించిన సభ్యుల ఒక అసభ్య కోర్కె ఆ సభ్య సంఘం తీరుస్తుంది. ఆ అసభ్య కోర్కె ఏమిటంటే మగవాళ్ళయితే, నచ్చిన వారిని ముద్దు పెట్టుకొనుట, ఆడవాళ్ళయితే నచ్చని వారిని చెప్పెట్టి కొట్టుట. మొత్తం మీద ముద్దెట్టుకున్న సభ్యులకన్నా చెప్పెటి కొట్టిన సభ్యులే ఎక్కువ! ఈ ఆదివారం అంతా ఉషారుగా వున్నారు అందరి కాళ్ళకి కొత్త చెప్పులు తళతళ లాడుతున్నాయి.

ఆ రోజే కొత్త సభ్యుడు ఏకాంబరం చేరాడు. ఏకాంబరానికి కొద్దిగా చెముడు. కానీ అది ఎవరికీ తెలీకుండా జాగ్రత్తపడతాడు. ఆ విషయం అందరికీ తెలుసు!

ఎక్కువసార్లు చెప్పుల్ని ముద్దెట్టుకున్న ఫౌండర్ మెంబర్ ద్వయంబకం లేచాడు. మొదలెట్టాడు.

“డియర్ జోకర్స్ వెనకటికో ప్రఖ్యాత జోకర్ పోయాట్ట! అంతా ఏడుస్తున్నారు. కాని ఆయన భార్య మాత్రం నవ్వుతోంది. ప్రక్కనున్న ఒక చిన్నమనిషి అడిగాట్ట - ‘అదేమిటమ్మా! మేమంతా ఏడుస్తుంటే నువ్వు నవ్వుతావు?” అని. దానికావిడ “ఉన్నప్పుడాయన ఏం ఏడ్చాడు కనుక, పోయినప్పుడు నేను ఏడవడానికి?” అందట.

సభ్యులంతా నవ్వడానికి ప్రయత్నించారు. నీలాంబరి లేచింది, “మిస్టర్ ద్వయంబకం నీ జోకు ఏడిచినట్టుంది. ఇది విను. వెనకటికో క్రాకర్ గారి భార్య పోయింది. క్రాకర్ కన్నా ఆయన మిత్రుడు సక్కర్ ఎక్కువ ఏడుస్తున్నాడు. క్రాకర్ గారు ఏడుపు ఆపేసి, “అంతలా ఏడవకోయ్, నే మళ్ళీ పెళ్ళి చేసుకుంటాగా!” అన్నాట్ట.

అని నీలాంబరి ముగించింది. సభ్యుల ప్రయత్నం ఫలించింది.

వెంటనే కాదంబరి అందుకుంది. “ఇది చాలా పాతజోకు! నేనో కొత్తది చెప్తా వినండి! ఒకావిడ రెండో మొగుడు పోయి ఏడుస్తోంది.

స్నేహితురాలు వచ్చి, “అంతలా ఏడవకోయ్ త్వరలో మళ్ళీ చేసుకోవచ్చులే” అని ఓదారుస్తోంది. దానికావిడ, “చేసుకుంటాను సరే! ఈ రాత్రి సంగతేమిటి?” అని మరింత ఏడ్చిందట.

సభ్యులు మరింత ఫలించారు. కొత్తగా చేరిన ఏకాంబరం లేచాడు. “మై డియర్ ఫ్రెండ్స్! ఈ పాత జోకులికి ఏం నవ్వుతారుగానీ, నేను వరుసగా మూడు సరికొత్త జోక్స్ చెప్తాను వినండి” అని మూడు జోకులు వరుసగా చెప్పాడు.

సభ్యులు కళ్ళమ్మట నీళ్ళు వచ్చేట్టు నవ్వారు. కాలర్ ఎగరేసుకుంటున్న చెవిటి ఏకాంబరానికి అసలు విషయం తెలీదు. ఆ మూడు జోకులు అంతకు ముందు వరుసగా ద్వయంబకం, నీలాంబరం, కాదంబరి చెప్పినవే !